

కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## కేయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 29: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపడుతున్న డిమాండ్ డే సందర్భంగా గురువారం కేయూలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీసీలను నియమించి, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులు అందించాలని కోరారు. నాన్‌టీచింగ్ అసోసియేషన్ నాయకులు, కేయూ ఎస్సీ ఎస్టీ సంఘం నాయకులు బొక్క మొగిలి, బీటీఏ నాయకుడు ఎన్ రాము, ప్రేమ్‌సాగర్, బాలాజీ, మంద శ్యామ్, విజయ్ రావు, మల్లికార్జున్, సిటీయూ నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

## పార్ట్‌టైం అధ్యాపకులకు ప్రమోషన్ ఇవ్వాలి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 29 : కేయూలో వివిధ విభాగాల్లో రెగ్యులర్ బడ్జెట్ సాంక్షన్ అగైనెస్ట్ వెకెంట్ పోస్టుల్లో 16 పీరియడ్ వర్క్‌లోడ్‌తో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులకు ప్రమోషన్ ఇచ్చి, కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కన్వర్ట్ చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు వై రాంబాబు, జనరల్ సెక్రటరీ నరేందర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవోజీనాయక్ కోరారు. గురువారం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రెగ్యులర్ పోస్టుల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను కేయూ అధికారులు, ఈసీ మెంబర్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తిరుపతి శేషు, ఎంటిజ్యూ రమేశ్, రవీందర్‌రెడ్డి, నవీన్, ప్రశాంత్, డీ బాలకృష్ణ, బక్కి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగాధిపతిగా సదాశివ్

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 29 : ఆర్ట్స్ కాలేజీ తెలుగు విభాగాధిపతిగా డాక్టర్ సదాశివ్‌ను నియమించినట్లు ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఏడాది కాలం ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, సహాయ రిజిస్ట్రార్ అశోక్ బాబు, తెలుగు అధ్యాపకులు చిర్ర రాజు, మామిడి లింగయ్య, చింతం ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు నాగయ్య, నరేశ్ పాల్గొన్నారు.

## బోర్డు మీటింగ్‌లో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్

హనుమకొండ, ఆగస్టు 29: గుజరాత్ రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన 175వ నేషనల్ కో ఆపరేటివ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకు వార్షిక సభలో రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుజరాత్ రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ చైర్మన్ డొంగర్ వీ కొచ్చాన్‌కు రవీందర్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

## వైద్యం వికటించి ఒకరి మృతి

**ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన ■ పోలీసుల రంగప్రవేశం**



హరిప్రసాద్ (ఫైల్)

కాశీబుగ్గ, ఆగస్టు 29: వైద్యం వికటించి ఒకరు మృతి చెందిన ఘటన వరంగల్ 3వ డివిజన్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో గురువారం జరిగింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లాలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన తెలుకుంట్ల హరిప్రసాద్(58) కార్పెంటర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 25న శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ములుగు జిల్లా రాంచంద్రపురం-పందికుంట గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిప్రసాద్ మోకాలికి తీవ్రగాయమైంది. వెంటనే బంధువులు కొత్తపేట క్రాస్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఆపరేషన్ చేయగా, అది ఫెయిల్ అయింది. మరుసటి రోజు మళ్లీ ఆపరేషన్ చేస్తామని వైద్యులు చెప్పగా మందులు కొనుగోలు చేశారు. అతడి కాలు తొలగిస్తే బతుకుతాడని బుధవారం అర్ధరాత్రి వైద్యులు తెలిపారు. తర్వాత అతడు టేబుల్‌డెడ్ అయినట్లు పేర్కొన్నారు. ఇంతలో అదే రాత్రి ఎనుమాముల పోలీస్‌స్టేషన్ నుంచి ఓ కానిస్టేబుల్ దవాఖానకు వచ్చి పేషెంట్‌ను పరిశీలించాడు. తెల్లవారుజామున హరిప్రసాద్ మృతి చెందాడని, డబ్బులు కట్టి మృతదేహాన్ని తీసుకెళ్లాలని నిర్వాహకులు సూచించారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందినట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో ఆసుపత్రిలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వైద్యులపై కేసు నమోదు చేసి దవాఖానను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఎనుమాముల సీఐ ఆలె రాఘవేందర్, మామునూరు సీఐ రవికుమార్, ఎస్సై రవి రంగంలోకి దిగి గొడవ సద్దుమణిగేలా చేశారు. అనంతరం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖానలోని మార్చురీకి తరలించారు. ఈ విషయమై దవాఖాన నిర్వాహకులను వివరణ కోరగా.. హరిప్రసాద్‌కు మెరుగైన వైద్య సేవలు అందించామని, వైద్యానికి అతడి ఆరోగ్యం సహకరించక మృతి చెందాడని తెలిపారు.

## బీఎల్‌వోలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

శాయంపేట, ఆగస్టు 29 : ఓటర్ల నమోదు జాబితాపై నిర్లక్ష్యం వహిస్తే బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభాషిణి అన్నారు. తహసీల్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటా సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తప్పులను, కొత్త ఓటర్లను గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఓటర్ల జాబితాను నిబంధనలకు అనుగుణంగా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ఇమామ్, ప్రభావతి, సూపర్‌వైజర్లు శరత్‌కుమార్, అచ్చారావు, రమేశ్, శైలజ, సత్యం తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభాషిణి

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# క్రీడాకారులు పతకాలు సాధించాలి

- కలెక్టర్ పీ ప్రావీణ్య
- జేఎన్ఎస్‌లో క్రీడోత్సవాలు
- జిల్లా వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవం



హనుమకొండ చౌరస్తా : క్రీడల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ చౌరస్తా/ ఆత్మకూరు/ దామెర/ న్యూశా యంపేట/ధర్మసాగర్, ఆగస్టు 29 : క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం జేఎన్ఎస్‌లో క్రీడలు నిర్వహించారు. బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్, అథ్లెటిక్స్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీలలో పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో 401 మంది బాలురు, 247 మంది బాలికలు పాల్గొని ప్రతిభచాటారు. వృత్తినైపుణ్యశిక్షణ కేంద్రంలోని శిక్షకులకు, శిక్షణ పొందుతున్నవారికి లెమన్ స్పూన్, తగాఫర్, మ్యూజికల్ చైర్ ఆటలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడాకారులను ఉత్సాహపర్చడానికి తన వంతు సహాయసహకారాలు అందిస్తానన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలైనవారికి కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్యదర్శి కైలాస్ యాదవ్, అథ్లెటిక్స్ కార్యదర్శి కే సారంగపాణి, కోచ్‌లు పాల్గొన్నారు. కాగా, పద్మభూషణ్ అవార్డు గ్రహీత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ప్రొఫెసర్ వై.వెంకయ్య అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేయూ అభివృద్ధి అధికారి ఎన్ వాసుదేవరెడ్డి, వ్యాయామ కాలేజీ ప్రిన్సిపాల్ ఏటీబీటీ ప్రసాద్ పాల్గొన్నారు.ఆత్మకూరు మండలం హౌసుబుజుర్గు పాఠశాలలో క్రీడలు నిర్వహించారు. పీఈటీ అనురాధ, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు. అలాగే, పెద్దాపురం జ్యోతిబా పూలే పాఠశాలలో కూడా క్రీడా దినోత్సవం నిర్వహించారు. దామెర మండలంలోని ఓగులాపురం సమీపంలో డిస్నీల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌తో పాటు, దామెరలోని ఏకశిలా ప్రైమ్‌స్కూల్‌లో ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో డిస్నీల్యాండ్ స్కూల్ ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేశ్‌భాను, దినేశ్‌చందర్, ఏకశిలా డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వస్కుల మణికుమార్ పాల్గొన్నారు. గ్రేటర్ 5వ డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్-1 కాలనీలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వలుస సారంగం, సాధుల రఘుపతి, కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, సదానందం, ప్రవీణ్, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేశ్, రవికిరణ్, నరేశ్, సురేశ్, రియాజ్, రాజు పాల్గొన్నారు. హంటర్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(వరంగల్ వెస్ట్)లో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ధర్మసాగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో అనిల్ కుమార్ హాజరై పోటీలను ప్రారంభించారు.



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

## కాజీపేటలో పాస్టర్ల ప్రేయర్ ఫెలోషిప్

కాజీపేట, ఆగస్టు 29 : కాజీపేటలోని కార్మెల్ బాప్టిస్ట్ చర్చిలో గురువారం మండల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ 6వ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. వేడుకలను ఫాదర్ డీ డేవిడ్ ప్రారంభించి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఆరేళ్లుగా సంస్థ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై చర్చించారు. బిషప్ జాన్ మార్కండేయ, బిషప్ డానియల్ కల్యాణపు, డాక్టర్ కే కురియన్, బీ విక్టర్ బాబురాజు, మంద కుమార్, ప్రతాప్, దేవదాస్, కరుణాకర్, జాకోబ్ పాల్గొన్నారు.

## కొండపర్తిలో ఎమ్మెల్యే నాగరాజు పూజలు

ఐనవోలు, ఆగస్టు 29 : కొండపర్తి వేణుగోపాలస్వామిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం దర్శించుకున్నారు. వేణుగోపాలస్వామి గుడి గోపుర సుదర్శన చక్ర పునః ప్రతిష్ఠ పూజ కార్యక్రమం, సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన మాచర్ల రాజు అనారోగ్యంతో మృతి చెందగా బాధితులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### గుడికి దారి ఇవ్వాలి

తమ కుల దైవం బీరన్న గుడికి దారి ఇప్పించాలని ఒంటిమామిడిపల్లి కురుమ కులస్తులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీరన్న గుడికి వెళ్లడానికి సరైన దారి లేక కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే, ఒంటిమామిడిపల్లి శివారు నాగపురం గ్రామస్తులు రేషన్ బియ్యాన్ని గ్రామంలో రెండు రోజుల పాటు ఇచ్చేలా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయనను కలిసిన వారిలో మండల నాయకులు బీ రాకేశ్‌రెడ్డి, గిరుక రాజు, పెద్ద కురుమ మజ్జిగ మహేందర్, మజ్జిగ శ్రీకాంత్, రాజయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజేందర్

## రేపు తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ సన్నాహక సమావేశం

హనుమకొండ, ఆగస్టు 29 : పెన్షనర్ విద్రోహదినాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ ఒకటిన జిల్లా కేంద్రంలో చేపట్టే జేఏసీ నిరసన ప్రదర్శనలు విజయవంతం చేసేందుకు శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ తెలిపారు.

గురువారం టీఎన్జీవో భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజేందర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో జేఏసీ భాగసామ్య సంఘాలైన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాలుగో తరగతి సంఘాల నేతలు తప్పకుండా హాజరు కావాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో నేతలు బైరి సోమయ్య, రాజేశ్‌ఖన్నా, శ్యాంసుందర్, రాంప్రసాద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ భూమయ్య స్తూపం ఆవిష్కరణ

శాయంపేట, ఆగస్టు 29 : మండలంలోని నేరేడుపల్లిలో కామ్రేడ్ పరికరాల భూమయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన స్తూపాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, మారపల్లి బుజ్జన్న, రాజు, రాజేందర్, కట్టయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

## మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వేలేరు, ఆగస్టు 29 : మహిళకు మాయమాటలు చెప్పి, నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరుకు చెందిన దేవులపల్లి పావనికి 13 ఏళ్ల క్రితం వరంగల్ కరీమాబాద్‌కు చెందిన దేవులపల్లి ఓంకార్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కాగా, భార్యాభర్తల మధ్య ఆర్థికపరమైన సమస్యలతో కొంత కాలం క్రితం పావని తన పుట్టింటికి వచ్చింది. పాత పరిచయం ఉన్న వేలేరుకు చెందిన సూత్రపు సతీశ్ ఆమెకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమె భర్తతో విడిపోయేలా చేశాడు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ హరిత హోటల్‌లో రహస్యంగా పెళ్లి కూడా చేసుకున్నాడని బాధితురాలు తెలిపింది. తర్వాత కొన్ని రోజులు ఇద్దరూ కలిసి ఉండగా పావనిని నమ్మించి, ఆమె దగ్గర డబ్బులు తీసుకున్నాడు. కొంత కాలంగా పావనిని దూరంగా పెడుతూ బూతులు తిడుతూ, శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో తనను మోసం చేసిన సూత్రపు సతీశ్‌పై చర్యలు తీసుకోవాలని పావని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ వెల్లడించారు.

## నిరుపయోగంగా జీపీ చెత్త ట్రై సైకిళ్లు

శాయంపేట, ఆగస్టు 29 : ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే ట్రై సైకిళ్లు నిరుపయోగంగా మూలన పడ్డాయి. శాయంపేట పంచాయతీలో 14 వార్డులున్నాయి. గతంలో స్వచ్ఛభారత్, స్వచ్ఛత, పరిశుభ్రత కోసం మూడు చక్రాల సైకిళ్లను చెత్త ఏరేందుకు గ్రామపంచాయతీల వారీగా అందజేశారు. అయితే, శాయంపేటలో ఏళ్ల తరబడి వాటిని వినియోగించకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టి పోతున్నాయి. మూలపడ్డ ఈ సైకిళ్లను బాగుచేసి వార్డుల్లో ఏ అవసరాలకు వాడుకున్నా ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు అంటున్నారు. వీటిని తిప్పుతూ చెత్తను ఎప్పటికప్పుడు తరలించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, ప్రస్తుతం ట్రై సైకిళ్లు మూలన ఉన్నది వాస్తవమేనని పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ అన్నారు. వీటిలో కొన్ని రిపేర్ చేయించి వాడుతున్నట్లు చెప్పారు.



గ్రామ పంచాయతీలో మూలన పడి ఉన్న చెత్త సేకరణ ట్రై సైకిళ్లు

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

హనుమకొండ, ఆగస్టు 29 : ఎల్లప్పుడూ విద్యుత్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించడానికి సాంకేతికతను వినియోగిస్తూ మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు హనుమకొండ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కే వెంకటరమణ తెలిపారు. ప్రతి ఒక్కపనిలో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా సైది(System Average Interruption Duration Index), సైఫీ (System Average Interruption Frequency Index)తో అంతరాయాలను తగ్గించినట్లు తెలిపారు. వినియోగదారుల పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ఈ-స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామని, మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని పేర్కొన్నారు. డిస్కమ్‌కు సంబంధించిన ప్రతి సమాచారాన్ని చూసే డాష్ బోర్డు అప్లికేషన్‌ను పెంపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. చాలా వరకు 33 కేవీ, 11 కేవీ ఇంటర్ లింకింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని ముందుకు వెళ్తున్నామని వివరించారు.

## 'హైడ్రా'ను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి

శాయంపేట, ఆగస్టు 29 : రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో చెరువులు, కుంటల పరిరక్షణకే ధ్యేయంగా హైడ్రాను ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. అన్ని మండలాల్లో కూడా హైడ్రాను విస్తరించి, చెరువులు, కుంటలు కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇంటర్‌లో నేడు స్పాట్ అడ్మిషన్లు

ఎల్కతుర్తి, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలికల)లో ఇంటర్‌లో 2024-25 సంవత్సరానికి శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు హెచ్ఎం హేమలత తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీల్లో ప్రవేశం కోసం నిర్వహించే అడ్మిషన్లకు విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని ఆమె సూచించారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

హనుమకొండ చౌరస్తా/పరకాల/ధర్మసాగర్/ఆత్మకూరు, ఆగస్టు 29 : తెలుగుభాషా దినోత్సవాన్ని గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జీ రాజారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. గిడుగు కృషివల్లే వ్యవహారిక భాషలో సాహిత్యం వచ్చి అందరికీ చేరువైందన్నారు. తెలుగు శాఖ అధ్యక్షుడు వెంక సత్యానారాయణ, అధ్యాపకులు బాసాని సీతారాములు, జీ మహేందర్, సునీత, పీ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ రజినీలత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, వాసం శ్రీనివాస్, రవీందర్, డీ రాజశేఖర్, శ్రీకాంత్, కృష్ణయ్య పాల్గొన్నారు. అలాగే, పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొని గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి నివాళులర్పించారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి మోరె అశోక్, అధ్యాపకులు రామకృష్ణ, సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కల్పన, భీమారావు, జగదీశ్, రాజశ్రీ పాల్గొన్నారు. ధర్మసాగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు పాటలు, కవితలు, పద్యాలు, నృత్యాల పోటీలను నిర్వహించారు. ప్రత్యేక అధికారి మధవి, పీజీ సీఆర్‌టీలు, సీఆర్‌టీలు పాల్గొన్నారు. ఆత్మకూరు మండలం పెద్దాపురం జ్యోతిబా పూలే పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామెర అనిత, వైస్ ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు సుహాసిని, భారతి, పీఈటీ కావ్య తదితరులు పాల్గొన్నారు.



పరకాల : గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



హనుమకొండ చౌరస్తా : రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

## ఓటర్ల జాబితాను రూపొందించాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి
- కలెక్టర్ ప్రావీణ్యకు ప్రశంసలు

హనుమకొండ, ఆగస్టు 29 : గ్రామ పంచాయతీల వారీగా ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించాలని స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి ఆదేశించారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటర్, పోలింగ్ కేంద్రాల జాబితా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీవోలతో హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్, రూపొందించడంలో ఉత్తమ ప్రతిభను చూపినందుకు కలెక్టర్ ప్రావీణ్యను ఆయన ప్రశంసించారు. జిల్లాలో 208 గ్రామపంచాయతీలుండగా, మొత్తం మెర్జింగ్ ప్రక్రియ 85 శాతం పూర్తయిందని, మిగతా ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, జిల్లాలో మొత్తం ఓటర్లు 3,73,900 మంది ఉన్నారని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 'అవయవ దానానికి ముందుకు రావాలి'

పరకాల, ఆగస్టు 29 : మరణానంతరం శరీరం మట్టిలో వృథాగా పోకుండా నేత్ర, అవయవదానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో నేత్ర, అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్నియా మార్పిడి కోసం 60 లక్షల మంది ఎదురు చూస్తున్నారన్నారు. మృతిచెందిన వారి నేత్రాలు దానం చేస్తే అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా అవయవ, శరీరదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి, ఫౌండేషన్ బాధ్యులు వెంకన్న, జేసీ రాజు, శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

## 'పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు'

పరకాల, ఆగస్టు 29 : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. నడికూడ, పరకాల మండలాలకు చెందిన పలువురు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు గురువారం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరమన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 609మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, పలువురు లబ్ధిదారులకు రూ.1.93కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే, నడికూడ మండల కేంద్రంలో ఎమ్మార్సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన చరిత్ర పరిశోధకుడు

దామెర, ఆగస్టు 29 : మన ప్రాంత చారిత్రక విశేషాలను జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించినట్లు చరిత్ర పరిశోధకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ రాచర్ల గణపతి తెలిపారు. రచయితలు, పలువురు విద్యావేత్తలు, అవార్డు గ్రహీతలతో కలిసి గవర్నర్‌ను కలిసి తెలుగువారి వారసత్వం, సబార్డినేట్ రూలర్స్ ఇన్ మెడివల్ దక్కన్, చంద్రగిరి పర్యాటక సిరి వంటి పుస్తకాల గురించి వివరించారు. ముఖ్యంగా దామెర మండలం కోగిల్వాయి సమీపంలోని శ్రీచంద్రగిరి చెన్నకేశవ స్వామి పర్యాటక ప్రాంతం విశిష్టత, చరిత్ర గురించి విన్న గవర్నర్ మంత్రముగ్ధులయ్యారని తెలిపారు. కాగా, గురువారం ఊరుగొండ ప్రభుత్వ పాఠశాలలో రాచర్ల గణపతిని ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.



కల్వర్టును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

## నూతన డీపీఆర్‌తో మెరుగైన సౌకర్యాలు

పరకాల, ఆగస్టు 29 : నూతన డీపీఆర్‌తో పట్టణ ప్రజలకు రానున్న రోజుల్లో మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ అన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నూతన డీపీఆర్(డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేసేందుకు గాను ఏజెన్సీ సభ్యులతో కలిసి ఆమె పట్టణంలో పర్యటించారు. సమస్యలపై సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. డీపీఆర్‌లో భాగంగా పట్టణంలో చేపట్టాల్సిన డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, కల్వర్టులు, పలు సమస్యలను గుర్తించనున్నట్లు తెలిపారు.

## విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

పోచమ్మమైదాన్, ఆగస్టు 29: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్‌కు అవకాశం ఉందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో ఆరోగ్య సంరక్షణ కార్మికులు, నర్సులకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో టామ్‌కామ్ ద్వారా అక్కడ చదువుకోవడానికి మూడేళ్ల నర్సింగ్ ఇంటర్నేషనల్ డిగ్రీని పొందటానికి అవకాశం ఉందని తెలిపారు. రెజ్యూమ్‌ను ఈ నెల 30 వరకు tomcom. germ any gmail.comకు మెయిల్ ద్వారా పంపించాలని కోరారు. వివరాలకు 6302292450, 7901290580 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## గుంతల పూడ్చివేత

ఆత్మకూరు, ఆగస్టు 29 : మండలంలోని గూడెప్పాడ్ నుంచి కొత్తగట్టు వరకు హైవేపై అడుగడుగునా ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలను గురువారం పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ సంతోశ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయన్నారు. ఈ గుంతల్లో వాహనాల పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా నివారణ కోసం గుంతలను పూడ్చివేస్తున్నట్లు తెలిపారు.



గుంతలను పూడ్చి వేయిస్తున్న పోలీసులు